# నమస్తే తెలంగాణ
## ములుగు
## జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, బుధవారం 16 ఏప్రిల్ 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


## వడదెబ్బతో ఇద్దరు వృద్ధుల మృతి


సుశీల(ఫైల్)


మల్లమ్మ(ఫైల్)

గార్ల/కొత్తగూడ, ఏప్రిల్ 15 : వడదెబ్బతో మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు. జిల్లాలోని గార్ల గ్రామ పంచాయతీ పరిధిలోని జీవంజిపల్లికి చెందిన సుశీల (62) మిర్చి తోటలో కూలి పనికి వెళ్లింది. ఎండ తీవ్రతకు తోటలోనే అస్వస్థతకు గురై కిందపడిపోయింది. కూలీలు గార్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అదేవిధంగా కొత్తగూడ మండలం వేలుబెల్లి గ్రామంలో బాసాని మల్లమ్మ (65) వడదెబ్బకు గురై మృతి చెందింది.


సభాస్థలంలో డయాస్ ఏర్పాటును పరిశీలిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

- పదేండ్లలో బ్రహ్మాండమైన పాలన అందించారు
- ఎల్కతుర్తి సభ చరిత్రలో నిలిచిపోతుంది
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- 500 మంది కూర్చునేలా సభావేదిక : మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

# తెలంగాణ కోసం తపించేది కేసీఆర్ ఒక్కరే..

ఎల్కతుర్తి, ఏప్రిల్ 15 : ఉద్యమ సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడి రాష్ట్రాన్ని సాధించారని.. ఈ ప్రాంత అభివృద్ధి, సంక్షేమంపై ఆయనకు ఉన్న తపన మరే నాయకునికీ, పార్టీకీ ఉండదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధిస్తామని చెప్పి చేసి చూపించిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని.. తెలంగాణ వెనకబడి ఉన్న ప్రాంతమన్న అభిప్రాయం ఉండేదని, కానీ పాలనా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ అభివృద్ధి చేసుకోవచ్చని రుజువు చేశారని కొనియాడారు. దురదృష్టవశాత్తు పార్టీలు గెలుస్తాయి, ఓడుతాయని, కానీ ప్రజలకు మంచి చేస్తేనే ఎవరినైనా గుర్తు పెట్టుకుంటారని వివరించారు. ఎల్కతుర్తిలో జరుగుతున్న సభ ఏర్పాట్లను, వేదిక పనులను మంగళవారం ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గత పదేండ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధితో బ్రహ్మాండమైన పరిపాలన అందించారని పేర్కొన్నారు. 27న జరగబోయే బహిరంగ సభకు ప్రజల నుంచి స్పందన చాలా బాగున్నదన్నారు. స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు ప్రజలు ఉత్సాహం చూపుతున్నట్లు తెలిపారు. ప్రజలకు అన్ని రకాల వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. సభకు వచ్చే వాహనాలకు సైతం పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డిలు నిత్యం దగ్గరుండి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని సభ కోసం భూములు ఇచ్చిన స్థానిక రైతులకు ధన్యవాదాలు చెప్తున్నట్లు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, నాయకులు మండల సురేందర్, ఎల్తూరి స్వామి, కడారి రాజు, తంగెడ నగేశ్, తంగెడ మహేందర్, శ్రీకాంత్‌యాదవ్, చదిరం నగేశ్, కోరె రాజుకుమార్, ఎండీ మదార్, పాటి భగవాన్, రాజేశ్వర్‌రావు, గుండేటి సతీశ్ పాల్గొన్నారు.

### 500మంది కూర్చునేలా సభావేదిక

ఎల్కతుర్తిలో బహిరంగ సభ ఏర్పాట్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. సభా వేదికను కేసీఆర్ సూచనల మేరకు 500మంది ప్రతినిధులు కూర్చునేలా ఏర్పాటు చేస్తున్నాం. సభా ప్రాంగణం, పార్కింగ్ కోసం ఇప్పటికే 1200 ఎకరాలు సేకరించాం. వరంగల్–సిద్దిపేట–కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలకు ఆయా రూట్లలో పార్కింగ్ స్థలాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల నాయకులు వచ్చి ముందుగానే పార్కింగ్ స్థలాలను చూసుకుని వెళ్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సైతం చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి లక్షలాది మంది సభకు వస్తారు. వారందరికీ అన్ని వసతులను కల్పిస్తున్నాం. సభ నిర్వహణ కోసం భూములు ఇచ్చిన చింతలపల్లి, ఎల్కతుర్తి గ్రామాల రైతులకు పార్టీ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు.

– వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే


తొర్రూరు : రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

# ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..

### కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి

- రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలి
- సన్నాహక సమావేశాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి

కాశీబుగ్గ/వర్ధన్నపేట/తొర్రూరు, ఏప్రిల్ 15 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని, తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు సిద్ధమవుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ఉద్యమకారులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్‌లోని కేవీ ఫంక్షన్‌హాల్, 3వ డివిజన్ ఆరెపల్లిలోని వజ్ర గార్డెన్స్, వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధి డీసీతండా, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలోనే గిరిజన తండాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అలాగే రైతులకు సాగునీరు సమృద్ధిగా అందడంతో వ్యవసాయంపై ఆధారపడిన గిరిజన కుటుంబాలు ఆర్థికంగా ప్రగతి సాధించాయన్నారు. తిరిగి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే గిరిజనులు మరింత అభివృద్ధి చెందుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 16 నెలలుగా తెలంగాణ ప్రజలకు చేసిందేమీలేదని, పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. మార్పును కోరుకున్న ప్రజలు ఇప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోయిన వారిని మరోసారి పార్టీలోకి తీసుకునే ప్రసక్తే లేదన్నారు. పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలమైన తీరుతో పాటు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ శ్రేణులు అధైర్యపడొద్దని, తాను ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి డివిజన్ల ఫోరం కన్వీనర్ నేరెళ్ల రాజు, వరంగల్ పీఏసీఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేశ్, వీర్ల భిక్షపతి, నాయకులు కేతిరి రాజశేఖర్, పత్రి సుభాష్, కొత్తపల్లి యాదగిరి, పత్రి రాజపోశాలు, గంద్రాతి భాస్కర్, పసులాది మల్లయ్య, వర్ధన్నపేట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, తొర్రూరు మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పీటీసీ మంగలపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ ప్రదీప్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, నాయకులు పొనుగంటి సోమేశ్వరరావు, ఎన్నమనేని శ్రీనివాసరావు, మణిరాజు, తూర్పాటి రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద తొర్రూరు సమస్యల పరిష్కార పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షకు ఎర్రబెల్లి మద్దతు పలికారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

- రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి
- ఆర్టీఐతో ఇందిరమ్మ ఇండ్ల వివరాలు సేకరిస్తా
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- శాయంపేట మండలంలో సన్నాహక సమావేశాలు

# ఉప్పెనలా కదలిరావాలి

శాయంపేట, ఏప్రిల్ 15 : ఊరూరూ ఉప్పెనలా మారాలని, ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరావాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. మహాసభ విజయవంతానికి గులాబీ సైనికులు కృషి చేయాలన్నారు. మంగళవారం శాయంపేట మండలంలోని హుస్సేన్‌పల్లి, పత్తిపాక, ప్రగతిసింగారం, అప్పయ్యపల్లి, నేరేడుపల్లి, నూర్జహాన్‌పల్లి, కాట్రపల్లి, కొప్పుల, వసంతాపూర్, గంగిరేణిగూడెం, సూర్యానాయక్‌తండా,సాధన్‌పల్లి, రాజుపల్లి గ్రామాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. మాందారిపేట నుంచి హుస్సేన్‌పల్లి వరకు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పద్నాలుగేళ్లు ఉద్యమంలో ఉన్న పార్టీ బీఆర్ఎస్ అని, నాడు ఆంధ్ర నాయకులతో కలిసి చంద్రబాబునాయుడు తెలంగాణకు అన్యాయం చేస్తుంటే ముందుకొచ్చిన కేసీఆర్ ప్రజల సహకారంతో కొట్లాడి రాష్ట్రాన్ని సాధించారన్నారు. పదేళ్ల తన పాలనలో కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కరెంటు, తాగునీళ్ల సమస్య పోయిందన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి తదితర అనేక పథకాలు అమలు చేసి దేశానికే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. అసత్య ప్రచారాలు, అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలనలో విఫలమైందన్నారు. మళ్లీ కేసీఆర్ వస్తేనే తమకు మేలు జరుగుతుందన్న భావన ప్రజల్లో నెలకొందన్నారు. జూన్ వరకు స్థానిక ఎన్నికలు రావొచ్చని, గులాబీ పార్టీలో కష్టపడే నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికకావచ్చన్నారు. బీఆర్ఎస్ మీటింగ్‌కు పోతే సంక్షేమ పథకాలు అందవని కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం ఏమీ ఇచ్చే స్థితిలో లేదని, మళ్లీ కేసీఆర్ వచ్చాకే పథకాలు అందుతాయని ప్రజలకు చెప్పాలని శ్రేణులకు సూచించారు. ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వలేదని, ఐదు, పది మందికి కూడా వచ్చే పరిస్థితి లేదని, దీంతో లిస్టును బయటకు రానివ్వడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై ఆర్టీఐ యాక్టు ద్వారా వివరాలు తీసుకుంటానని, కాంగ్రెసోళ్లు పప్పు పుట్నాల్లా పంచుకుంటే బయట పడుతుందని గండ్ర అన్నారు. సమావేశాల్లో మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, గంటా శ్యాంసుందర్‌రెడ్డి, దూదిపాల తిరుపతిరెడ్డి, మారెపల్లి నందం, కొమ్ముల శివ, దైనంపెల్లి సుమన్, పసుల ప్రవీణ్, అరికిల్ల ప్రసాద్, గాజె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాసభకు భారీగా బైలెల్లాలె..


సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

- రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి
- అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేయాలి
- సన్నాహక సమావేశంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

కాటారం, ఏప్రిల్ 15 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మంథని నియోజకవర్గం నుంచి గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. మంగళవారం కాటారం మండల కేంద్రంలో జరిగిన మల్హర్, కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, పలిమెల మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధూకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ 24 వసంతాలు పూర్తి చేసుకొని 25వ ఏడాదిలోకి విజయవంతంగా అడుగుపెడుతున్న తరుణంలో అధినేత కేసీఆర్ పిలుపు మేరకు మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గులాబీ జెండాలు ఎగురవేసి సభకు బయలుదేరాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కేసీఆర్ సందేశం కోసం ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారన్నారు. ఎప్పటికైనా రాష్ట్రానికి బీఆర్ఎస్, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు జక్కు రాకేశ్, మండలాధ్యక్షులు జోడు శ్రీనివాస్, కుంభం రాఘవరెడ్డి, జవ్వాజి తిరుపతి, లింగంపల్లి శ్రీనివాస్ రావు, మండల రాజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు శాంతకుమార్, గీతాబాయి, ఎండీ అలీం, పంతకాని సడువలి, హరీశ్, కొండగొర్ల వెంకటస్వామి, గాలి సడువలి, రాదారపు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆశయాలకు అంకితమై పనిచేసేది బీఆర్ఎస్

### మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

గిర్మాజీపేట, ఏప్రిల్ 15 : గడిచిన 25 ఏండ్లుగా ప్రజల ఆశయాలకు అంకితమై పనిచేస్తున్నది బీఆర్ఎస్ ఒక్కటేనని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఎల్కతుర్తిలో 27న నిర్వహించే రజతోత్సవ మహాసభలను పురస్కరించుకొని మంగళవారం ఆయన 25వ డివిజన్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ రజతోత్సవ మహాసభను ప్రతీ కార్యకర్త పండుగలా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీదేనని కార్యకర్తలు భరోసాగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దుర్గారావు, మంజుల, ఖాజా, నజీర్, షకీలా, హుస్సేన్, జన్ను సైకిలాబ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేసిన మోరీలు, ప్రభుత్వ భూమి అని తెలిపే హద్దురాయి

# దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- వరద కాల్వను ధ్వంసం చేసి మోరీ నిర్మాణం
- అసైన్డ్ ల్యాండ్‌లోని వెంచర్‌కు దారిగా వినియోగం
- రియల్టర్లపై చర్యలు తీసుకోని అధికారులు

నర్సంపేట, ఏప్రిల్ 15 : నర్సంపేటలో ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని సంబంధిత మున్సిపల్, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. నర్సంపేట నుంచి నెక్కొండకు వెళ్లే ప్రధాన రహదారిలో కాకతీయనగర్‌కు సమీపంలో సర్వే నంబర్ 601లో ప్రభుత్వ భూమి ఉంది. దీనిని ఆనుకొని ఉన్న కొంత అసైన్డ్ భూమిని ఎలాంటి అనుమతులు లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ చేశారు. ఈ వెంచర్‌కు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వరద కాల్వను రియల్టర్లు ధ్వంసం చేశారు. ఇందులో పెద్ద మోరీని నిర్మించి, దానిపై మొరం పోసి వెంచర్‌కు దారిగా వినియోగిస్తున్నారు. గడిచిన ఏడాదిన్నరలో మూడుసార్లు ఇలాగే పైప్‌లైన్లు వేస్తే వాటిని అధికారులు తొలగించినప్పటికీ రియల్టర్లలో ఎలాంటి మార్పు రాలేదు. అధికారులు వారిని హెచ్చరించినా పెడచెవిన పెడుతున్నారు. పైగా అసైన్డ్ భూమిలో వెంచర్ కోసం వేసిన హద్దు రాళ్లను సైతం మున్సిపల్ అధికారులు తొలగించారు. అయినప్పటికీ వెంచర్‌లోని ప్లాట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటిని కొనుగోలు చేసిన వారు రానున్న రోజుల్లో ఇబ్బందులు పడతారని స్థానికులు అంటున్నారు. పైగా వరద కాల్వను ఆక్రమించడంతో వానకాలంలో నాలాలు, వాగులు ఉప్పొంగి కాలనీలు, పంట పొలాలు నీట మునిగే అవకాశాలున్నాయంటున్నారు.

### మా దృష్టికి వచ్చింది

నర్సంపేట–నెక్కొండ ప్రధాన రహదారిలో సర్వే నంబర్ 601లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి మోరీలు వేశారన్న విషయం మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. గతంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులను హెచ్చరించారు. మళ్లీ భూమిని పరిశీలించి ఆక్రమణదారులపై తగిన చర్యలు తీసుకుంటాం. – రాజేశ్, తహసీల్దార్, నర్సంపేట

# 19 నుంచి కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరవధిక సమ్మె

### కేయూ వీసీకి నోటీస్ అందజేత


కేయూ వీసీ ప్రతాపరెడ్డికి సమ్మె నోటీస్ అందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 15: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈ నెల 19 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నారని కేయూ కోఆర్డినేషన్ కమిటీ నేతలు నిరంజన్, శ్రీధర్ కుమార్‌లోద్, మాదాసి కనకయ్య, జూల సత్య తెలిపారు. వారం రోజులుగా అనేక నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దీనిని నిరసిస్తూ స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం సమ్మె నోటీసును కాకతీయ యూనివర్సిటీ వీసీ కే ప్రతాపరెడ్డికి అందజేశారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలను కాపాడుతున్న తమ రెగ్యులరైజేషన్ ప్రక్రియను తక్షణమే అమలు చేయాలని అనేక మార్లు అనేక ప్రభుత్వాలకు మొ రపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. అంతేకాకుండా పలువురు అధ్యాపకులు ప్రభుత్వ వ్యవహార శైలిని నిరసిస్తూ తమ అడ్మినిస్ట్రేషన్ పదవులకు కూడా రాజీనామా చేసి, రాజీనామా పత్రాలను కేయూ రిజిస్ట్రార్, వీసీలకి అందజేశారన్నారు. అంతకుముందు కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. 16, 17వ తేదీల్లో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నాను తలపెట్టామని, దీనికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సాదు రాజేశ్, బీ సతీశ్, ఫిరోజ్ పాషా, ఆశీర్వాదం, సంకినేని వెంకన్న, ఆరూరి సూర్యం, గడ్డం కృష్ణ, టీ నాగయ్య, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, వినీత, శ్రీదేవి, వీణ, సునీత, సుచరితపాల్, సుజాత, శ్రీలత, సంగీత్‌కుమార్, భాగ్య, ఉషాకిరణ్, వాణిశ్రీ, స్వామి, సదాశివ, తూర్పాటి వెంకటేశ్, సాహితీ, చందులాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్ ప్రారంభం


పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ

మహదేవపూర్ (కాళేశ్వరం), ఏప్రిల్ 15 : వచ్చే నెల 15 నుంచి 26 వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో జరగనున్న సరస్వతీ పుష్కరాలకు సంబంధించిన యాప్, వెబ్ పోర్టల్‌ను మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు మంగళవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో ప్రారంభించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లకు సంబంధించిన సమగ్ర సమాచారం తెలిపేందుకు దీనిని రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేశామని, 50 వేల నుంచి లక్ష మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ధార్మిక పరిషత్ అడ్వైజర్ గోవిందహరి, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ఈవో మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘భూ భారతి’ పైలట్ మండలంగా వెంకటాపూర్

ములుగు, ఏప్రిల్15 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి ప్రాజెక్టులో పైలట్ మండలంగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్‌లో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎంపిక చేశారు. ప్రజల నుంచి వచ్చే భూ సమస్యలు, సూచనలు, సలహాల ఆధారంగా ఈ పోర్టల్‌లో మార్పులు చేశారు. కొత్త రెవెన్యూ చట్టంపై అధికారులు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి భూ సమస్యలను పోర్టల్ ద్వారా పరిష్కరించనున్నారు. వెంకటాపూర్ మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీలు, 10 రెవెన్యూ గ్రామాలున్నాయి. మొత్తం 74,667 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండగా, ఇందులో 31,102 ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. రైతులకు సంబంధించి 9,128 ఖాతాలుండగా మండల వ్యాప్తంగా 13,533 మంది రైతులున్నారు. సాగు చేస్తున్న భూమి ఒక చోట ఉంటే వాటి సర్వే నంబర్ మరో ప్రదేశంలో ఉన్నాయి. వెంకటాపూర్ తహసీల్దార్ వద్ద ఇప్పటి వరకు 60 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి.

## విద్యార్థినిని వేధించిన స్కూల్ బస్ డ్రైవర్‌కు మూడేండ్ల జైలు

వరంగల్ లీగల్/మడికొండ, ఏప్రిల్ 15: పదో తరగతి విద్యార్థినిని ప్రేమించాలంటూ వేధించిన స్కూల్ బస్ డ్రైవర్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ హనుమకొండ అదనపు జిల్లా జడ్జి అపర్ణాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. 2023 జనవరి 19న మడికొండకు చెందిన బాలిక స్కూల్‌కు వెళ్లనంటూ ఏడ్వడంతో తండ్రి అడిగాడు. ప్రతి రోజు స్కూల్ బస్సులో వెళ్తుండగా ధర్మసాగర్ మండలం నారాయణగిరికిచెందిన బస్ డ్రైవర్ పసునూరి రఘు తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరిస్తున్నాడని చెప్పింది. దీంతో తండ్రి మడికొండ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో అప్పటి ఎస్సై నర్సింహారావు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడు రఘుపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణలో భాగంగా కోర్టు కానిస్టేబుల్ వీ రాజేశ్, 9 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ రాజమల్లారెడ్డి కేసు వాదించగా నేరం రుజువైంది. జడ్జి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.25,000 లీగల్ ఎయిడ్ సర్వీస్ నుంచి చెల్లించాలని తీర్పునిచ్చారు. కాగా భరోసా నుంచి సీహెచ్ నీరజ, కోర్టు లైజన్ ఆఫీసర్ పరమేశ్వరి, మడికొండ ఎస్సై రాజ్‌కుమార్, కోర్ట్ హోంగార్డ్ సదానందం సహకరించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.